# తోలు బొమ్మలు

కపిలేశ్వరపురం హెడ్‌మాస్టరు కాంపౌండులోంచి స్కూలులోకీ, స్కూలులోంచి కాంపౌండులోకీ, కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నారు.

వార్షికోత్సవం !

తాను కొత్తగా హెడ్ అయిన తర్వాత జరిగే మొట్టమొదటి ఉత్సవం ఇదే. ఏం రసాభాస అవుతుందో అని భయం. కారణం, అనుకున్న

అధ్యక్షులు రాలేదు. కనుచూపు మేరలో కూడ వస్తూన్న జాడ కనిపించడం లేదు.

ఏం దారి ?

నేనభయ మిచ్చాను. డాక్టరుగారు పిడుగులు పడినా రావడంమానరు. మాలనిక్కచ్చి అయిన మనిషి. మీరు 'విఘ్నేశ్వర' పూజకానిస్తూ ఉండండి. అంటే- సెక్రటరీ రిపోర్టు, దండలు, శాలువాలు రంగంమీదికి చేర్చడం, ప్రార్థనకు ఆడపిల్లల్ని సిద్ధం చెయ్యడం, వగైరా అన్నమాట-

అసలు రహస్యం ఏమిటంటే- హెడ్‌మాస్టరుగారు నా ద్వారానే డాక్టర్ కనకరాజు, ఎఫ్. ఆర్. సి. ఎస్. (ఇ) గారిని అధ్యక్షులుగా వరించారు. డాక్టర్ మంచివక్త. ఖులాసా మనిషి. ఆవకాయ దగ్గర్నుంచి అమెరికా రాజకీయాలదాకా అనర్గళంగా మాట్లాడగలరు.

నాకు ముఖ్య స్నేహితులు.

అంతెత్తు మనిషిని తన హయాంలో అధ్యక్షులుగా ఉంచి సభ జరపడం ప్రధానోపాధ్యాయులవారి ప్రథమ కాంక్ష!

డాక్టరుగారు రాజమండ్రినుంచి రావాలి. రాలేదు. సభ 5 గంటలకు. 5-30 అయింది. అందాకా పసుపువిఘ్నేశ్వరుడులా హెడ్‌మాస్టరు అధ్యక్ష స్థానంలో కూర్చున్నారు.

చూపులు రోడ్డుమీద -

ఆడపిల్లల అపస్వరాల స్వరమేళనంతో ప్రార్థన అయింది.

కారు బర్రుమని వచ్చి స్కూలుముందు ఆగింది. హెడ్‌మాస్టరుగారు కుర్చీకి స్ప్రింగ్ వున్నట్టు ఎగిరిపడి వరండామీదకు వచ్చారు.

డాక్టరుగారు కారు దిగారు.

"తన వెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధవ్రాతమున్" అన్నట్టు వెంట లచ్చిలేదుగాని, ఒక లక్ష్మీపుత్రుడు సరస్వతీ పుత్రుడూ వున్నారు.

కనకరాజుగారు నవ్వుతూ అందర్నీ పలకరించి "రాజువెడలె సభకు" అనిపించారు.

స్వాగతవచనా లయాయి.

డాక్టరుగారు ఆపరేషన్లలో యెంత హస్తలాఘవం గలవారో అధ్యక్ష పీఠ నిర్వహణంలో కూడా అంత కృతహస్తులు !

లాంఛనోపన్యాసాలు జరిగాయి. డాక్టరుగారు లేచి కులాసాగా 20 నిమిషాలు మాట్లాడి, పైన ఆపరేషన్లలాగా హేలగా ముగించారు. అంతకు ముందుగా స్కూలు తెలుగు పండితుడు కనకరాజుగారి ముఖం ఎరక్కపోయినా—'నవరత్నాలు' చదివి సభక్తికంగా సమర్పించాడు.

డాక్టరుగారు తమాషా మనిషి. తెలుగు పండితుడితో తెలుగు సాహిత్యం గురించీ, క్రికెట్ ఆటగాడితో క్రికెట్ పరుగుల గురించీ నిరర్గళంగా మాట్లాడగలరు.

అధ్యక్షుడినుంచి నా వరకూ అతిథులకు హెడ్‌గారు తలో ఖద్దరు శాలువా బహూకరించారు. డాక్టరుగారు ఖరీదయిన సూటుమీద ఖద్దరుశాలువా అంతర్జాతీయ అవగాహనకు దాఖలాగా వుంది.

తెలుగు పండితుడు డాక్టరుగారి వెంటపడ్డాడు. డాక్టరుగారితో ఎప్పటి కేనా పని ఉండక పోతుందా అని. కనకరాజుగారికి ఒక విదూషకుడు దొరికితే చాలు- ఆటపట్టించడం మహా సరదా—

సత్రంలో బ్రహ్మాండమైన డిన్నరు ఏర్పాటు చేశారు. సత్రం హాలులో చేరాం.

డాక్టరుగారు తెలుగు పండితుడితో "అయ్యా, మీ నవరత్నాలకేం గాని మీరు వెనక రాసిన నాలుగు మంచి పద్యాలు చదవండి" అన్నారు. తెలుగు పండితుడు అడగడమే తడవు అందుకుని రాగయుక్తంగా పది పద్యాలు చదివాడు. ఇందాక చదివిన వాటికీ వీటికీ పోలికలేదు. డాక్టరుగారు కొంటె మనిషి, "ఈ పద్యాలు మీరు రాసినవేనా అన్నంత బాగున్నా యండీ".

వెనకటికి ఒక డన్నాట్ట మీరు రాసిన రెండు త్యాగరాజ కీర్తనలు పాడమని- అన్నట్టుంది. అందులో వ్యంగ్యం ఆ శ్రోత్రియ పుత్రుడు గ్రహించలేదు. ఆ పద్యాలు పాపయ్యశాస్త్రిగారి 'విజయశ్రీ'లోవి. ఈయనేం కనిపెట్టగలరు? అనుకున్నాడుగాని డాక్టరుగారు దేవాంతకుడు !

సవ్వేశాం.

ఆయన కబుర్లపోగు. డిన్నరులో పదార్థాలకన్న కబుర్లే ఎక్కువ తిన్నాం. వెంటనే తిరుగు ప్రయాణం. మండపేటలో పని చూసుకు రాజమండ్రీ వెళ్ళాలి. కారులో బయలుదేరాం.

తోవలో వల్లూరులో రోడ్డుపక్క తోలుబొమ్మలాట జరుగుతోంది. మాతోవున్న సారస్వతేయుడు రాయలసీమవాడు. అదేమిటన్నాడు. తెగ ఆశ్చర్యపడిపోతూ- అనడమేమిటి డాక్టరుగారు కారు దిగేసి ఆయనతో

బొమ్మలాట పందిరిలోకి వెళ్ళి నేపథ్యంలోకి ప్రాకి - ఆటపెద్దతో మాట్లాడి యోగ క్షేమా లడిగి అక్కడి ఇత్తడి చెంబుల్లోవి మంచినీళ్ళేనా ? అని శంకించి బయటకొచ్చారు. ఏటవాలుగా ఉన్న పందిరికి తెల్లని తెర వెనక వేలాడే ఆముదం దీపాలు- తోలు కత్తిరించి అందంగా_ అలంకారాలతో, హారాలతో, తయారుచేసిన ఆ బొమ్మలు, 'దీపాల వెలుగులో ధగధగ మెరుస్తున్నాయి.

రావణాసురుడు కిందనున్న బల్లలు తొక్కుతూ సీతామ్మవారిని గద్దిస్తున్నాడు. సీతబొమ్మవెనక కీచుగొంతుక ఒకపాటతో తిరస్కరిస్తోంది.

కారు మండపేటలో ఆగింది.

కందర్పవారింట మకాం. ఆ రాత్రికి అక్కడే, అని డాక్టరుగారు ప్రకటించారు. 'చచ్చాం పో' అనుకున్నారు అనుయాయులు. మార్చుకోడానికి గుడ్డలులేవు. డాక్టరుగారు నిశ్చింతగా సూటు విడిచేసి ఖద్దరు శాలువా లుంగీగా చుట్టబెట్టారు.

'యథారాజా తథా ప్రజాః'

పైన బనియాను, కింద శాలువా లుంగీలు.

యూనిఫారంగా భజన సమాజంలా వున్నాం. డాక్టరుగారు మంచం మధ్య కూచుని కబుర్లు విదేశారు. తన చిన్నతనంలో- బ్రాహ్మణులు వాళ్ళ 'వచ్చీ రాని' సంస్కృతశబ్దాలూ _ ఒకటే హాస్యోక్తులు - తెల్లారిపోయింది.

కారు డ్రైవరు చేతులు కట్టుకుని ఎదుట నుంచున్నాడు!